క్లుప్తంగా

బాబాకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో షిర్డీసాయిబాబా

పొదలకూరు: పట్టణంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో స్వామివారికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం బాబాకు అభిషేకాలు, అష్టోత్తర, సహస్ర నామ పూజలు చేశారు. సాయంత్రం మందిరంలో భక్తుల భజనలు, రాత్రి స్వామివారి పల్లకీసేవ నిర్వహించారు. శేజ్‌హారతితో పూజా కార్యక్రమాలు ముగిశాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

సాయిబాబా మందిరాల్లో..

మనుబోలు: మండలంలోని మనుబోలు, జట్ల కొండూరు, మడమనూరు గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో గురువారం సాయినాథునికి విశేష పూజలు నిర్వహించారు. మనుబోలులోని పిడూరు రోడ్డులో ఉన్న సాయిబాబా మందిరంలో అర్చకుడు శ్రీనివాసులు సాయిబాబాకు అభిషేకాలు, ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహించారు. గంధళ్ల కృష్ణయ్య – అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు సాయినాథుని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

ముత్తుకూరు : పట్టణంలోని బలిజపాళెం ప్రాథమిక పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌కు ఎంపికయ్యారు. భానుమునిసంజీవ్, వై.తేజాస్వరూప్, బి.నిఖిల్, బి.హర్వినికేత్, బి.జ్యోతిష, ఎస్‌కే అప్సర, పి.జాహ్నవి చిలమానేను, గండిపాళెం, వెంకటగిరి రెసిడెన్షియల్ స్కూల్స్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం గురువారం తెలిపారు.

వివాహిత అనుమానాస్పద మృతి

నెల్లూరు సిటీ: అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతిచెందిన ఘటన నెల్లూరు రూరల్ పరిధిలోని గుడిపల్లిపాడు గ్రామంలోని బలరామపురంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఆదిపూడి లక్ష్మమ్మకు (43) వెంకటేశ్వర్లు అనే వ్యక్తితో వివాహమైంది. వారికి శ్రీనివాసులు అనే కుమారుడు ఉన్నాడు. కాగా వెంకటేశ్వర్లు కొన్నేళ్ల క్రితం భార్యను వదిలేసి వెళ్లిపోయాడు. మూడునెలల క్రితం ఇంటికి తిరిగొచ్చాడు. బుధవారం రాత్రి అందరూ భోజనం చేసి నిద్రపోయారు. గురువారం తెల్లవారుజామున ఇంటి వెనుక ఖాళీ స్థలంలో లక్ష్మమ్మ చనిపోయి ఉండడాన్ని నారాయణ అనే వ్యక్తి చూసి శ్రీనివాసులుకు చెప్పాడు. అదే సమయంలో వెంకటేశ్వర్లు కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

సంగం: మండలంలోని ఉడ్‌హౌస్‌పేట వద్ద నెల్లూరు–ముంబై జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృత్యువాత పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. మర్రిపాడు మండలం ఇర్లపాడు గ్రామానికి చెందిన వెంకటేష్(35) మోటార్‌బైక్‌పై నెల్లూరుకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఉడ్‌హౌస్‌పేట వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుకగా ఢీకొన్నాడు. దీంతో అతను రోడ్డుపై పడడంతో తలకు తీవ్ర గాయమైంది. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి హైవే అంబులెన్స్‌లో నెల్లూరు వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలో బుచ్చిరెడ్డిపాళెం వద్ద మృతి చెందాడు. దీంతో వెంకటేష్ మృతదేహాన్ని బుచ్చిరెడ్డిపాళెం మార్చురీకి తరలించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు.

ఆటోను ఢీకొన్న కారు

- మహిళకు తీవ్రగాయాలు

సంగం: ఆటోను కారు ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న విజయలక్ష్మి అనే మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన గురువారం రాత్రి దువ్వూరు వద్ద చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. సంగం గ్రామానికి చెందిన విజయలక్ష్మికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో గురువారం ఉదయం నెల్లూరు వైద్యశాలకు వెళ్లింది. అక్కడ చూపించుకుని తిరిగి ఆటోలో సంగం వస్తుండగా దువ్వూరు వద్ద సంగం నుంచి బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న విజయలక్ష్మి తీవ్రంగా గాయపడింది. క్షతగాత్రురాలిని 108 వాహనంలో బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఆమెను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తరలించారు. సంగం ఎస్సై నాగార్జునరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఐటీఐకు మహర్దశ

ఎట్టకేలకు పొదలకూరులో ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థకు చక్కటి శాశ్వత భవనం సమకూరింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంజూరై తాత్కాలిక రేకుల షెడ్‌లో దశాబ్దానికి పైగా నిర్వహించిన ఐటీఐ కళాశాలకు భవనం ఏర్పాటైంది. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఈ కళాశాలను మంజూరు చేస్తే ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కళాశాల భవన నిర్మాణానికి రూ.3.38 కోట్ల నిధులు మంజూరు చేసి నిర్మాణాన్ని పూర్తి చేయించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో భవనం మంజూరుకు కృషి చేశారు.

- పొదలకూరులో ప్రభుత్వ ఐటీఐ కళాశాలకు శాశ్వత భవనం
- తొలగిన భవన నిర్మాణ సమస్య
- ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు చదువుకునే అవకాశం



పొదలకూరులోని ఐటీఐ కళాశాల నూతన భవనం

పొదలకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలోని పాత సమితి కార్యాలయంలో 2008 నవంబర్‌లో ఐటీఐ కళాశాలను తాత్కాలికంగా రేకుల షెడ్‌లో ప్రారంభించారు. రాష్ట్ర విభజన ఇక్కడి ఐటీఐ కళాశాలకు శాపంగా మారింది. లేదంటే కొత్త భవనంలో కోర్సుల నిర్వహణ జరుగుతూ ఉండేది. వందల మంది విద్యార్థులు పలు కోర్సుల్లో ఇక్కడ శిక్షణ తీసుకున్నారు. ప్రస్తుతం 92 మంది విద్యార్థులు ఇక్కడ హార్టికల్చర్, కోపా (కంప్యూటర్ ఆపరేటర్ – ప్రోగ్రామ్ అసిస్టెంట్), డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, సూయింగ్ టెక్నాలజీ కోర్సుల్లో శిక్షణ పొందుతున్నారు. మరో 16 మంది వివిధ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్నారు. గతంలో చాలీచాలని తరగతి గదుల్లో విద్యార్థులు విద్యను అభ్యసించలేక ఇబ్బందులు పడేవారు.



ఐటీఐ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి కాకాణి (ఫైల్)

సొంత భవనానికి స్థలం కేటాయింపు

గత ప్రభుత్వ హయాంలో పొదలకూరు పట్టణానికి సమీపంలో చిట్టేపల్లితిప్ప వద్ద 10 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఐటీఐ కళాశాలకు కేటాయించారు. రాష్ట్ర విభజనకు ముందు అక్కడ భవన సముదాయానికి రూ.2.65 కోట్లు మంజూరయ్యాయి. పాలనా పరమైన అనుమతులు పూర్తయిన తర్వాత రాష్ట్ర విభజన జరగడంతో నిధులు ఆగిపోయాయి. టీడీపీ ప్రభుత్వంలో తిరిగి రూ.3.25 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి రెండు, మూడు పర్యాయాలు నివేదించినా బుట్టదాఖలయ్యాయి. గ్రామీణ ప్రాంతంలో యువకులు స్వశక్తిపై జీవించేందుకు ఉపయోగపడే ఐటీఐ కళాశాల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం చొరవ తీసుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తన సొంత మండలం కావడంతో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలోనే భవన నిర్మాణానికి రూ.3.38 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఆయన చేతులమీదుగానే పనులకు శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు పూర్తయిన తర్వాత ఈ కళాశాలను ప్రారంభించారు.

కొత్త కోర్సులకు అవకాశం

ఐటీఐ కళాశాలలో ప్రస్తుతం ఉన్న కోర్సుల్లో సూయింగ్ (టైలరింగ్), డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్‌కు కొంతవరకు ప్రాధాన్యం ఉంది. మిగిలిన హార్టికల్చర్, కోపా కోర్సులకు ప్రాధాన్యం తగ్గినట్టుగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో శాశ్వత భవన వసతి సమకూరడంతో కొత్త కోర్సుల ఏర్పాటుకు అవకాశం కలిగింది. అదనంగా ఇక్కడ డీజిల్ ఇంజిన్ల మెకానిజం, ఎలక్ట్రికల్ వంటి కోర్సులు ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తున్నాం.

కోర్సులను పెంపొందిస్తాం



ఐటీఐ కళాశాలకు కొత్త భవనం ఏర్పడడంతో కోర్సులు ఏర్పాటు చేసేందుకు అవకాశం కలిగింది. ఇందుకు సంబంధించిన నివేదికను రూపొందించి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి పంపాం. తద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఐటీఐ పూర్తి చేసి ఉపాధి అవకాశాలు పొందే అవకాశం కలగనుంది.

– బి.మురళీధర్, ప్రిన్స్‌పల్, ఐటీఐ కాలేజీ, పొదలకూరు

టీబీ నిర్మూలన ప్రభుత్వ లక్ష్యం

ఇందుకూరుపేట: టీబీ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వ్యాధి సోకేందుకు అవకాశం ఉన్న పెద్ద వయస్సు వారికి బీసీజీ టీకాలు వేస్తున్నామని వైద్యాధికారి డాక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు. మండలంలోని జగదేవిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సచివాలయాల్లో బుధవారం ఆర్‌ఎన్‌టీసీపీ కార్యక్రమంలో భాగంగా అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టీకా సురక్షితమైందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ శ్రీనివాసులు, హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు, హెల్త్ సూపర్‌వైజర్లు రమ, సతీష్ బాబు, ఫార్మసీ ఆఫీసర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



టీకా వేయించుకుంటున్న వైద్యాధికారి కిషోర్‌కుమార్

డెంగీ నివారణపై అవగాహన

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: డెంగీ నివారణపై మండలంలోని జొన్నవాడ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది గురువారం ఆ గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీ డాక్టర్ అహ్మద్ బాబు మాట్లాడుతూ వర్షాకాలం మొదలవుతున్న నేపథ్యంలో డెంగీ, మలేరియా ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. వారంలో ఒకరోజు డ్రైడే పాటించడం ద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. ఎవరికైనా జ్వరం, ఒళ్లునొప్పులు, ఆకలి మందగించడం తదితర లక్షణాలు ఉంటే వెంటనే పీహెచ్‌సీకి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు వినయ్‌కుమార్, నాగరాజు, హెచ్‌ఈఓ సుబ్బారెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న వైద్యులు, సిబ్బంది

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- ప్రయాణికులకు స్వల్పగాయాలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రాఘవరెడ్డి కాలనీ వద్ద గురువారం వింజమూరు వైపు నుంచి నెల్లూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సును.. నెల్లూరు నుంచి సంగం వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి వైద్యం చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ హైమారావు తెలిపారు.



ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, లారీ

మండపం.. ప్రగతి పథం

- రూ.12.27 కోట్లతో అభివృద్ధి పనులు
- సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు రూ.13.25 కోట్ల లబ్ధి

తోటపల్లిగూడూరు: మండలంలోని తీర ప్రాంతమైన మండపం పంచాయతీ గడిచిన ఐదేళ్లలో ప్రగతి పథంలో ముందుకుసాగింది. తీర ప్రాంత పంచాయతీ కావడంతో ఎమ్మెల్యేగా, మంత్రిగా కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈ పంచాయతీ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీలోని అన్ని గ్రామాల్లో ఎక్కడా మట్టిరోడ్లు కన్పించకుండా సీసీ రోడ్లు, డ్రైనేజ్ వ్యవస్థలను ఏర్పాటు చేయించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేశారు. పంచాయతీలో గడిచిన ఐదేళ్లలో ఎన్నడూ లేనివిధంగా రూ.12.27 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను చేశారు. అలాగే మరో రూ.13.25 కోట్లు సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందాయి.

నెరవేరిన కల

అనంతపురంలో ఉన్న సెంబ్‌కార్ప్ విద్యుత్ పరిశ్రమ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఇసుకదొరువుల వాసుల కల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నెరవేరింది. ఈ గ్రామంలోని 94 కుటుంబాలకు పునరావాస కాలనీ ఏర్పాటు చేయాలనే స్థానికుల విజ్ఞప్తి మేరకు సాలిపేట సమీపంలో నూతన పునరావాస కాలనీ నిర్మితమైంది. ఒక్కో పక్కా గృహం రూ.14.60 లక్షలతో మొత్తం 94 గృహాల కాలనీ అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దారు. ఈ సాలిపేట పునరావాస కాలనీలోకి స్థానికులు 2022 మార్చి 20న అడుగుపెట్టారు. సెంబ్‌కార్ప్ యాజమాన్యం సీఎస్సార్ నిధులతో ఏర్పాటు చేసిన ఈ పునరావాస కాలనీ నిర్మాణ విషయంలో మంత్రి కాకాణి కృషి ఎంతో ఉంది.

విద్యుత్ సమస్యలకు చెక్

మండపం పంచాయతీ పరిధిలో ఆక్వా సాగు అధికం ఉండడంతో విద్యుత్ సమస్యలు అధికంగా ఉండేవి. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రభుత్వం 33 లెవన్ కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించేందుకు రూ.2.80 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో సీఎస్‌పురంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మితమైంది. తద్వారా రైతులు, గృహ విద్యుత్ వినియోగదారుల లోఓల్టేజ్ సమస్యకు చెక్ పడింది. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల చంద్రశేఖర్‌పురం, మండపం, గొల్లపాళెం, ఈదూరు, పాతకోడూరు, కొత్తకోడూరు గ్రామాలకు నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసే అవకాశం లభించింది. అలాగే ఈ పంచాయతీలో పలు అభివృద్ధి పనులు జరగడంపై స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సీఎస్‌పురంలో నూతనంగా నిర్మించిన విద్యుత్ సబ్‌స్టేషన్ (ఫైల్)

విద్యుత్ కష్టాలు తీరాయి



ఆక్వా, వరిసాగులతో విద్యుత్ వాడకం అధికమై గ్రామంలో లోఓల్టేజ్ సమస్య అధికంగా ఉండేది. వేసవిలో ఈ సమస్య మరింత ఇబ్బందికరంగా ఉండేది. గృహ వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. మంత్రి కాకాణి నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి నిధులను మంజూరు చేయించి త్వరతగతిన పనులను పూర్తి చేయించారు. తద్వారా గ్రామంలో విద్యుత్ సమస్యకు చెక్ పడింది.

– సుధీర్, స్థానికులు, మండపం పంచాయితీ

మండలం – తోటపల్లిగూడూరు
పంచాయతీ – మండపం
మజరా గ్రామాలు – కాటేపల్లి, ఇసుకదొరువు, ఈదూరు పట్టపుపాళెం, చంద్రశేఖరపురం, గొల్లపాళెం, సాలిపేట, మండపం

గ్రామంలో మట్టి రోడ్డు లేదు



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామంలో ఎక్కడా మట్టి రోడ్డు కన్పించకుండా సీసీ రోడ్లను నిర్మించారు. అలాగే డ్రైనేజ్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మంత్రి కాకాణి సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు జరిగాయి.

– ప్రవీణ్, స్థానికుడు, మండపం పంచాయతీ

మంత్రి కాకాణి సహకారం మరువలేది



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మా పంచాయతీ దిశ తిరిగింది. మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయడంతోపాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి పేదలకు అండగా నిలిచించి. ఇసుకదొరువు పునరావాస కాలనీ ఏర్పాటుతోపాటు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం ప్రజలకు ఎంతో ప్రయోజనకరం.

– కాల్తిరెడ్డి సుబ్బారావు, సర్పంచ్, మండపం



సాలిపేటలో నిర్మితమైన ఇసుకదొరువు పునరావాస కాలనీ



నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు

11 సచివాలయాల్లో వ్యాక్సినేషన్ ప్రారంభం



వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు సిటీ: క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా బీసీజీ టీకా కార్యక్రమాన్ని రూరల్ మండలంలోని అల్లీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 11 వార్డు సచివాలయాల్లో గురువారం ప్రారంభించారు. రాష్ట్ర నోడల్ అధికారి డాక్టర్ రమాదేవి, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పెంచలయ్య, అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి పెద్ద చెరుకూరు సచివాలయంలో వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన వారు, ధూమపానం అలవాటు ఉన్న వారితోపాటు గతంలో క్షయ వాధికి గురైన వారు, వారి కుటుంబసభ్యులను గుర్తించి తప్పనిసరిగా టీకా వేయాలన్నారు. అవసరం ఉన్న ప్రతి ఒక్కరికీ టీకా వేయాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ కొడావత్ బలరామ నాయక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విడవలూరు సుజాత, పబ్లిక్ హెల్త్ నర్స్ చంద్రగిరి లూసీ, క్షయ నివారణ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయాల్లో చోరీకి యత్నం



పరిశీలిస్తున్న పోలీసులు

సంగం: స్థానిక పెన్నానది ఒడ్డున ఉన్న గంగమ్మ, పోలేరమ్మ ఆలయాల్లో బుధవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి యత్నించారు. ఆలయాల ప్రాంగణంలోని సీసీ కెమెరాలను ధ్వంసం చేసి తలుపుల తాళాలు పగులగొట్టేందుకు యత్నించి వెళ్లిపోయారు. గురువారం ఉదయం ఆలయాల వద్దకు వచ్చిన అర్చకుడు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నాగార్జునరెడ్డి ఆలయం వద్దకు వచ్చి పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రక్తపోటుపై అప్రమత్తంగా ఉండాలి



డాక్టర్ వైష్ణవిని సన్మానించిన నాయకులు

నెల్లూరు(అర్బన్): ప్రజలు రక్తపోటు (బీపీ) పట్ల అప్రమత్తంగా ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మెదడు, నరాల వ్యాధి నిపుణురాలు డాక్టర్ వైష్ణవి సూచించారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవాన్ని పురస్కరించుకుని కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని మద్రాస్ బస్టాండ్ వద్ద ఉన్న డాక్టర్ పెంచలయ్య ఆర్థోపెడిక్ ఆస్పత్రి ఆవరణలో రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వైష్ణవి మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ థీమ్ ప్రకారం బీపీని చెక్ చేయించుకోవాలన్నారు. హైబీపీ ఉన్న వారు క్రమం తప్పకుండా మందులు వినియోగించాలన్నారు. రక్తపోటు ఎక్కువైతే గుండెపోటు, పక్షవాతం, కంటి వ్యాధులు వస్తాయి కాబట్టి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం పీహెచ్‌పీ అసోసియేషన్ నాయకులు డాక్టర్ వైష్ణవిని సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, సీనియర్ నాయకులు శాఖవరపు వేణుగోపాల్, శేషయ్య, వీరయ్య, ప్రసాద్, మాలిని, కరుణకుమారి, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విస్తృతంగా అవగాహన

- నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



నెల్లూరు(క్రైమ్): 'సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అవగాహనతోనే వాటి నియంత్రణ సాధ్యం' అని నగర డీఎస్పీ డి. శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం ఆయన నెల్లూరులోని తన కార్యాలయంలో సైబర్ నేరాలపై మాట్లాడారు. అధికశాతం యువత ఇంటర్నెట్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. డేటింగ్ వెబ్‌సైట్లలో సబ్ స్క్రైబ్ చేసుకోరాదని, అందులో నుంచి వచ్చిన లింక్‌లను క్లిక్ చేయకుండా ఉండడం మంచిదన్నారు. పరియంలేని వ్యక్తులకు మీ వాట్సప్ నంబర్లు, మెయిల్ ఐడీలు షేర్ చేయరాదని, వీడియో కాల్స్‌లో మాట్లాడరాదని సూచించారు. ఫేస్‌బుక్‌లో గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను యాక్సెప్ట్ చేయకూడదన్నారు. నిజజీవితంలో పరిచయం ఉన్న వ్యక్తులను మాత్రమే ఆన్‌లైన్‌లో విశ్వసించాలన్నారు. అపరిచితులతో స్నేహాలు, ప్రేమలు మంచిది కాదన్నారు. ఆన్‌లైన్ వేధింపులు, ట్రోలింగ్‌లు పెరిగాయన్నారు. ఇంటర్నెట్ మాయలో పడి మానవ సంబంధాలు దెబ్బతినకుండా జాగ్రత్త పడాలన్నారు. కేవైసీ అప్‌డేట్, లాటరీలు, ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్, ఉద్యోగాలు, న్యూడ్ వీడియోకాల్స్ పేరిట మోసాలకు పాల్పడుతున్నారని వాటికి దూరంగా ఉండాలన్నారు. వ్యక్తిగత వివరాలను, ఫొటోలను సోషల్ మీడియాలో పంచుకోవడం మంచిది కాదన్నారు. మహిళలపై వేధింపులకు పాల్పడినా, ఇబ్బందులకు గురిచేసినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సైబర్ నేరగాళ్ల చేతుల్లో మోసపోయినప్పుడు ఎలాంటి సంకోచం, సందేహం పెట్టుకోకుండా ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలన్నారు. టోల్‌ఫ్రీ నంబర్ 1930, సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా దగ్గరలో ఉన్న పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.